## క్లుప్తంగా

### ముగిసిన ఉచిత శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

**హిందూపురం టౌన్:** సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తూమకుంట చెక్‌పోస్ట్, చౌళూరు, గోళ్లాపురం, గుడ్డంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డ్యాన్స్, పెయింటింగ్ , మట్టితో పాత్రలు తయారు చేయడం, జంక్‌తో జుగాడ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

### గుండెపోటుతో వ్యక్తి మృతి

**హిందూపురం అర్బన్:** పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో గురువారం ఉదయం కర్ణాటక రాష్ట్రం గుండ్ల కొత్తూరు సమీపంలోని జింక నాయనహళ్లికి చెందిన నారాయణస్వామి (45) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి కుటుంబీకులకు సమాచారం అందించామన్నారు.

### అమ్మవార్లకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ గార్లు

**పావగడ:** స్థానిక నల్లరాళ్ళ గంగమ్మదేవి జాతరోత్సవాల సందర్భంగా గంగమ్మదేవితో పాటు ఏడు అక్కమ్మ గార్లకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పసుపు, కుంకుమ అభిషేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సమితి అధ్యక్షురాలు చైత్రలక్ష్మి, ఉపాధ్యక్షుడు చలపతి, కార్యదర్శి గంగాధర్, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు భక్తులకు సేవలందించారు.

### నేడు ఎన్నికల ప్రచారం

**మడకశిరరూరల్:** మండలంలోని వైబీ హళ్లి, హరేసముద్రం, బుళ్లసముద్రం పంచాయతీల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### పశుగ్రాసం బ్యాంక్ ప్రారంభం



పశుగ్రాసం బ్యాంకును ప్రారంభిస్తున్న అధికారులు

**పావగడ:** తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో పశుగ్రాసం బ్యాంక్‌ను అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ కారణంగా పశువులకు మేతను అందించేందుకే పశుగ్రాసం బ్యాంకును ఏర్పాటు చేశామన్నారు. రైతులు పశుగ్రాసాన్ని కిలో రూ.2 చొప్పున బ్యాంకు వద్ద కొనుగోలు చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జిల్లా డీడీ గిరీశ్‌బాబురెడ్డి, ఏడీ హరికేరప్ప, పశు వైద్యాధికారి జగన్నాథ్, ఉప తహసీల్దార్ కిరణ్‌కుమార్, పీడీఓ జయణ్ణ, కార్యదర్శి హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి తోడ్పడే వారికే మద్దతు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

**హిందూపురం టౌన్:** నియోజకవర్గంలో విద్యారంగం అభివృద్ధికి తోడ్పడే అభ్యర్థులకే మద్దతు తెలుపుతామని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించే అభ్యర్థులకే మద్దతు తెలియజేస్తామన్నారు. నాయకులు చంద్రశేఖర్, నరసింహమూర్తి, తరుణ్, జశ్వంత్, దేవరాజు, శశి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# బాబూ... ఈ పాపం ఊరికేపోదు

- పింఛన్ కోసం బ్యాంకుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- వలంటీర్లు ఇంటి దగ్గరకే తెచ్చిచ్చేవారు..
- చంద్రబాబు కుట్రలతోనే ఇబ్బందులు పడుతున్నామని పింఛన్‌దారుల ఆగ్రహం

'ఎండనకా.. వాననకా ఒకటో తేదీ వచ్చిందంటేచాలు తెల్లవారుజామునే ఠంఛన్‌గా పింఛన్ సొమ్ముచేతికిచ్చేవాళ్లు. జగనన్న ప్రభుత్వంలో పింఛన్ కోసం ఆరాటపడే రోజులే మర్చిపోయాం. అయితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుట్రలతో ఇప్పుడు మళ్లీ పాతరోజులు గుర్తుచేస్తున్నారు. ఈ పాపం వాళ్లకు కచ్చితంగా తగులుతుంది' అంటూ పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు. చాలా మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌కు అనుసంధానం కాకపోవడం, డబ్బులు తీసుకునేందుకు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో పింఛన్‌దారులతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇన్నాళ్లూ కాలు కదపకుండానే ఇంటి వద్దకే పింఛన్ వచ్చేలా చేసినా జగనన్నకే తమ మద్దతని లబ్ధిదారులు చెబుతున్నారు.

– సాక్షిబృందం



హిందూపురంలోని డీఎల్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ వద్ద పింఛన్‌దారుల పడిగాపులు



అమరాపురం: కెనరా బ్యాంకులో పింఛన్ డబ్బు కోసం...



లేపాక్షి: పింఛన్‌దారులతో కిటకిటలాడుతున్న గ్రామీణ బ్యాంకు



రొళ్ల ఏపీజీబీ బ్యాంక్‌లో అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

### జగనన్నకే మా మద్దతు



మాలాంటి ముసలోళ్లు పింఛన్ డబ్బులు ఎక్కడ తీసుకోవాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నాం. వలంటీర్లు వచ్చి చేతికి ఇచ్చేవాళ్లు. ఇప్పుడు సచివాలయం వెళ్తినా ఇవ్వలేదు. బ్యాంకులకు వెళ్లు అంటున్నారు. బ్యాంకుకు వచ్చి రూ.200, రూ.300 ఖర్చు చేసుకుని వచ్చి పేపర్లు తీసుకొని పాసు బుక్కులు చేసుకోవాల్సి వస్తోంది. వలంటీర్లు వచ్చి పింఛన్ ఇవ్వకపోతే టీడీపీకి ఓట్లు ఎవరేస్తారు? మాకు కష్టం లేకుండా చేసిన జగనన్నకే మా మద్దతు.

– పాపమ్మ, హిందూపురం

### మాలాంటి వారికి ఇదో శిక్ష



ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయమే నవ్వుతూ మా వలంటీర్ ఇంటివద్దకు వచ్చి పింఛను చేతికిచ్చేవారు. ఇప్పుడు వారికి ఇవ్వలేదంట. బ్యాంకులో వేశారంట. లేపాక్షి బ్యాంకుకు ఆటోలో వస్తే ఇక్కడ గంట ఉండమన్నారు. 12 గంటలు అవుతోంది. మళ్లీ వెళితే క్యూ పెద్దది కావడంతో ఈ ఆటోలోనే కూర్చొన్నాము. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. ఈ బాధలు ఎప్పుడు తప్పుతాయో.

– రత్నమ్మ, గంగమ్మ, ఉప్పరపల్లి, లేపాక్షి

### చంద్రబాబుకు బుద్ధి చెబుతాం



ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి తలుపులు తట్టి పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు వలంటీర్ల ద్వారా పింఛన్ ఇవ్వకుండా అడ్డుకుని ఎండలో అవస్థలు పడే దుస్థితికి తీసుకొచ్చారు. గ్రామం నుంచి ఆరు కిలో మీటర్లు దూరం మండుటెండలో ఉదయాన్నే రొళ్లలో గ్రామీణా బ్యాంక్ వద్దకు వచ్చాం. ఇక్కడ కొస్తే వందల సంఖ్యలో జనాలు పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి దుస్థితి తెచ్చిన చంద్రబాబుకు తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము.

– కరియన్న గారి తిమ్మక్క , కల్లురొప్పం, రొళ్ల మండలం

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం

**మడకశిర:** పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భాస్కర్ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎన్ రవిశేఖర్‌రెడ్డి,పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తదితరులు సంతాపం తెలిపారు. ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**హిందూపురం:** మండలంలోని చౌళూరులోని వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు రామాంజి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి ... రామాంజి భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**లేపాక్షి:** స్థానిక లేపాక్షిలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.

### టీడీపీని చిత్తుగా ఓడించండి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

**మడకశిరరూరల్:** వలంటీర్ల ద్వారా పింఛన్లు పంచడానికి వీలులేదని ఎన్నికల కమిషన్ ద్వారా ఆదేశాలు వచ్చేలా చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పి చిత్తుగా ఓడించాలని రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తెలిపారు. వారు గురువారం నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. టీడీపీకి రోజురోజుకూ ప్రజాదరణ తగ్గిపోతోందని, ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమన్నారు.

## జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



లేపాక్షిలో రోడ్‌షోకు హాజరైన ప్రజలు

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక



లేపాక్షిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ

**లేపాక్షి:** మండల కేంద్రమైన లేపాక్షిలో గురువారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక జోరుగా ప్రచారం నిర్వహించారు. మొదట ఐటీబీ బ్యాంకు సమీపం నుంచి నంది విగ్రహం వెనుక ఉన్న ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్ వరకూ రోడ్ షో నిర్వహించారు. వారికి లేపాక్షి మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లేపాక్షిలోని వీవర్స్ కాలనీ, పాతూరు, ఎగువ పేట, ఎస్సీ కాలనీ, బీసి కాలనీ, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రచారం చేసి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా దీపిక, శాంతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ అందించిందన్నారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూరిందని విమర్శించారు. జగనన్నకు సంపూర్ణ మద్దతిచ్చి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి, సర్పంచ్ ఆదినారాయణ, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు అశ్వత్థప్ప, అగ్రిబోర్డు చైర్మన్ ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు బషీర్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నారాయణస్వామి, మాజీ ఎంపీపీ హనోక్, నాయకులు శంకరప్ప, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, ఇర్ఫాన్, నిస్సార్, నరసప్ప, శ్రీరామిరెడ్డి, ప్రభాకర్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక



హిందూపురం: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నాయకులు



రొళ్ల : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నాయకులు



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

**హిందూపురం:** నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో 27 వార్డు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దాదాపు 100 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.

**రొళ్ల:** మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లిలో గురువారం మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గోవిందప్ప, రఘు, భోజన్న, క్రిష్ణమూర్తి, గోవిందప్ప, మహలింగప్పతో పాటు వారి అనుచరులు సుమారు 30 కుటుంబాలు ఆపార్టీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

**మడకశిరరూరల్:** మండలంలోని మరువపల్లి, ఆర్ అనంతపురం గ్రామాలకు చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి గురువారం రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. హరీష్, నాగరాజు, నరసింహప్ప, గోవిందప్ప వారి అనుచరులకు కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. సీ.కొడిగేపల్లికి చెందిన గంగాధర్‌రెడ్డి టీడీపీ వీడి సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు.

## జగన్ మరోసారి సీఎం కావడం తథ్యం

**మడకశిర:** వైఎస్ జగన్ మరోసారి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రచార కమిటీ ఇన్‌చార్జ్ వైజీ నందన తెలిపారు. ఆమె గురువారం సాక్షితో మాట్లాడుతూ తాను గత కొన్ని రోజుల నుంచి మహిళా విభాగం ప్రచార కమిటీ సభ్యులతో కలిసి మండల వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఏ ఇంటికి వెళ్ళినా తాము జగన్‌కే ఓటేస్తామంటున్నారని పేర్కొన్నారు.

## మోసకారి చంద్రబాబు మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

**అగళి:** ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చే మోసకారి టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. గురువారం మండల పరిధిలోని అగళి, ఆర్.జిపల్లి, రామనపల్లి పంచాయతీ పరిధిలోని రామాపురం, ఆర్‌జి పల్లి, బొమ్మసానిపల్లి, నరసేగౌడనపాళ్యం, హనుమనపల్లి, కోడిపల్లి, పూలపల్లి, దాసేగౌడపల్లి, జంగమరపల్లి, ముక్కడంపల్లి, రామనపల్లి, కసాపురం, కురసాంగానపల్లి, రామనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అంతకుముందు రామాపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానన్నారు. ప్రజా సేవ చేసే ఎమ్మెల్యే కావాలా? లేక సేవ చేస్తానని నమ్మించి దోచుకోవడానికి వచ్చిన ఎమ్మెల్యే కావాలో ఓటర్లే తేల్చుకోవాలన్నారు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో నాలుగేళ్ల అధికారంలో ఉన్నప్పుడు మడకశిరను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. అప్పుడు రైల్వే లైను ఎందుకు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కరోనా వచ్చినప్పుడు రఘువీరారెడ్డి జనాలు గుర్తుకు రాలేదా, చంద్రబాబు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు అప్పుడు రైల్వేలైను గుర్తుకు రాలేదా అని విమర్శించారు. ఎలక్షన్ వచ్చినప్పుడు మాత్రమే రఘువీరారెడ్డి ఓట్లు అడగడానికి ప్రజల ముందుకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీతో రఘువీరారెడ్డి కుమ్మక్కై , టీడీపీని గెలించడానికే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను పోటీలో నిలబెట్టారని ఆరోపించారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌జీ పల్లిలో గురుశాంత్ వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ , మడకశిర ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, డైరెక్టర్ నేత్రావతి, ఎంపీపీ రేణుక, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, వైస్ ఎంపీపీ, గాయత్రి, విమలమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ శివన్న, సర్పంచులు సన్నమ్మ, ముద్దరాజు, శివకుమార్, రామకృష్ణప్ప, సరస్వతి, లక్ష్మమ్మ, కృష్ణప్ప, ఎంపీటీసీ మంజుల, కోఆప్షన్ మెంబర్ నాసిర్, మాజీ ఏడీసీసీ అధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, సీనియర్ నాయకులు కామరాజు, నటరాజు, సతీష్, వెంకటస్వామి, సూర్యనారాయణరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**బిడ్డకు అండగా తల్లి**

'నిరుపేదవాడైన నా కొడుకు గెలిపించండి అను నిత్యం మీ సేవకుడిలా పని చేస్తాడు' అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తల్లి కదురమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్‌జీ పల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, తల్లి కదురమ్మ, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కదురమ్మ మాట్లాడుతూ తన కొడుకు ఉపాధి కూలీగా పని చేస్తున్నాడన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు టికెట్ ఇచ్చారని, జరిగే ఎన్నికల్లో తన కొడుకు గెలిపిస్తే ప్రతి పేదవాడు గెలిచినట్లేనన్నారు.



## జోరుగా ఎన్నికల ప్రచారం



గుడిబండ: ప్రచారంలో పాల్గొన్న దళితులు



ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న నర్సేగౌడ్, వైటీ ప్రభాకర్‌రెడ్డి

**అగళి:** వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఈరలక్కప్ప, శాంతమ్మను గెలిపించాలని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నేత్రావతి ప్రజలను కోరారు. ఆర్ జీ పల్లి, కోడిపల్లి, అగళి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మహిళ కార్యకర్తలతో కలసి ఆమె ప్రచారం చేశారు.

**అమరాపురం:** స్థానిక లింగాయత్ వీధి, కోట వీధి, పాత ఎస్సీ కాలనీ, ఆర్టీటీ కాలనీ, పాత మసీదు వీధి, మెయిన్ బజారుల్లో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. హాలుకూరులో రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, మద్దనకుంటలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ గగన మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

**గుడిబండ:** మండల పరిధిలోని గుడ్డదహళ్లి, జీఎస్ తండా, ఆచార్యపాళ్యం, మోరబాగల్ దళితవాడలో గురువారం దళితులు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళితులకు గౌరవం లభించిందని, అందుకే రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రచారం చేస్తున్నట్లు నాయకులు నాగరాజు, నటరాజు, గిరిధర్ తెలిపారు.

**మడకశిర:** వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపు రాష్ట్రానికి ఎంతో అవసరమని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు కావడం ఖాయమని , దీన్ని గుర్తించి ప్రజలందరూ మరోసారి జగనన్నకు పట్టం కట్టాలన్నారు. పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.